క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి శనివారం సందర్భంగా వేకువజాము నుండి స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మడకలవారిపల్లె గ్రామానికి చెందిన జయసుబ్బారెడ్డి, అరుణ దంపతుల ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రిటర్న్ క్విజ్ పోటీలు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు రిటర్న్ క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 71 మంది విద్యార్థులు హాజరయ్యారని గ్రంథాలయాధికారిణి తిరుపతమ్మ తెలిపారు. అలాగే హౌసింగ్ బోర్డులోని గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఎస్.భాస్కర్‌రెడ్డి తెలిపారు.

వేలం ద్వారా రూ.4.45 లక్షల ఆదాయం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో శనివారం టెంకాయల విక్రయానికి వేలం పాట నిర్వహించారు. పిచ్చయ్య రూ.4.45 లక్షలకు వేలం దక్కించుకున్నాడు. గతేడాడి రూ.4.17లక్షలు వేలం పోగా ఈ ఏడాది రూ.4.45లక్షల ఆదాయం వచ్చిందన్నారు. తలనీలాలకు నిర్వహించిన వేలంలో ఎవరూ పాల్గొనకపోవటంతో వేలం వాయిదా వేసినట్లు ఈఓ తెలియజేశారు.

విదేశీనాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో విదేశీ నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు టి.సదాశివారెడ్డి 210 దేశాల నాణేలు, 110 దేశాల కరెన్సీ నోట్లను ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి, విశ్రాంత తెలుగు పండితుడు వీఎం భాస్కర్‌రాజులు సదాశివారెడ్డిని అభినందించి సత్కరించారు.

ప్రతిభ చాటుకున్న రామకృష్ణారెడ్డి

కలసపాడు : మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి కేంద్ర ప్రభుత్వం ప్రజలను, యువతను చైతన్యవంతులను చేసేందుకు ఇటీవల ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ప్రతిభ చాటుకున్నారు. భారతదేశంలో బాధ్యత కలిగిన పౌరులను తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్, మహిళా సాధికారత, రక్తదానం, అవయవదానం, సైబర్‌క్రైమ్, యంగ్ వారియర్స్, యోగా, పర్యావరణం వంటి వివిధ సామాజిక అంశాలపై నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి పాల్గొని 65 ప్రశంసాపత్రాలను సాధించాడు. సామాజిక బాధ్యత కలిగిన రామకృష్ణారెడ్డి ప్రతిభ సాధించడం పట్ల ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీబీఐటీలో ఉచిత వైద్య శిబిరం



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

చాపాడు: స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో శనివారం ప్రొద్దుటూరు రోటరీ క్లబ్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. సీబీఐటీలో పని చేస్తున్న బస్ డ్రైవర్లు, క్లీనర్లకు కంటి సంబంధిత, బీపీ, సుగర్ ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి గజ్జుల వెంకటేశ్వరెడ్డి, సెక్రెటరి ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవం.. పోలేరమ్మ గ్రామోత్సవం

- అమ్మవారికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రత్యేక పూజలు
- పాల్గొన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి కరుణాకర్‌రెడ్డి దంపతులు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం



రథంలో కొలువుదీరిన పోలేరమ్మవారు



గ్రామోత్సంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో శ్రీ పోలేరమ్మవారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ, నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం పోలేరమ్మ విగ్రహాన్ని రథంలో కొలువు దీర్చి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నుంచి ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. భక్తుల మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో పాతూరు దగ్గర ఉన్న రచ్చబండ దగ్గరకు అమ్మవారు చేరుకున్నారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొత్తూరులో గ్రామోత్సవం నిర్వహించారు. మల్లేపల్లె రోడ్డు, మఠం నాలుగు రోడ్ల కూడలి నుంచి పోలేరమ్మ గుడి మీదుగా సోమిరెడ్డిపల్లెకు చేరుకోగానే గ్రామస్తులు ఘన స్వాగతం పలికి వీధులలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామోత్సవం వెంట కందిమల్లాయపల్లె వాసులు ఒడిసా నుంచి రప్పించిన కళాకారుల వివిధ వేషాధారణ ప్రదర్శన, డప్పు వాయిద్యాలు, తప్పెట డప్పులు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమిరెడ్డిపల్లెలో డీజే, కోలాటం ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కోసం పోలేరమ్మ గుడి దగ్గరకు సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

పోలేరమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి బి.మఠం నిర్వాహకులు, కందిమల్లాయపల్లె పుర ప్రజల ఆహ్వానం మేరకు వచ్చారు. వీరబ్రహ్మేంద్రస్వామి పోలేరమ్మ చేత నిప్పు తెప్పించిన రచ్చబండ దగ్గరికి అమ్మవారి రథోత్సవం చేరుకోగా.. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు దేవస్థానం ఫిట్‌పర్సన్, ఎండోమెంట్ ఏసీ శంకర్‌బాలాజీ, ఎంపీపీ సీ వీరనారాయణరెడ్డి, గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం పోలేరమ్మ నూతన గుడి దగ్గర ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమం మండపంలో పూజలు నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి కుమారులు, వేద పండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

- కర్ణాటక మాజీ మంత్రి గాలి కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. నూతన విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, పోతులూరయ్యలు దగ్గర ఉండి పూజలు చేయించారు. అమ్మవారి ప్రతిష్ఠకు వచ్చిన భక్తులకు శని, ఆదివారాలు రెండు రోజుల పాటు దాదాపు 7 వేల మందికి కరుణాకర్‌రెడ్డి భోజన ఏర్పాటు చేస్తున్నారు.
- పోలేరమ్మ గ్రామోత్సవంలో తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1లోపు నూతన గుడిలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం స్థానిక ఎస్ఐ విద్యసాగర్ ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.



గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం

ప్రతి ఒక్కరికీ రేషన్ అందాలి

ప్రొద్దుటూరు : ప్రతికార్డుదారునికి తప్పకుండా రేషన్ అందించాల్సిన బాధ్యత డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై ఉందని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. మున్సిపల్ సభాభవనంలో మండల పరిధిలోని చౌకదుకాణాల డీలర్లతో, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఇటీవల సీఎం జగన్ పర్యటన సందర్భంగా ప్రజలు తమకు రేషన్ అందలేదని పులివెందుల నియోజకవర్గంలో తెలిపారన్నారు. దాంతో జిల్లా అధికార యంత్రాంగం మొత్తం అప్రమత్తమైందని, ఎవరికి రేషన్ అందకపోయినా సంబంధిత డీలర్ లేదా ఎండీయూ ఆపరేటర్‌ను బాధ్యునిగా చేసి తొలగిస్తామన్నారు. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతోందని, పట్టుకుంటే క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి అన్ని చోట్ల రేషన్ పంపిణీపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎండీయూ ఆపరేటర్లు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, మిల్లు ఆర్ఐ సాయిప్రసాద్‌తోపాటు ఎంఈఓ శోభారాణి పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా సాగునీటి బోర్లు



బోరు వెల్ వాహనం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు

చాపాడు : జలకళ ఉచిత బోర్ వెల్ పథకం ద్వారా ప్రభుత్వం రైతులకు సాగునీటిని అందించేందుకు ఉచితంగా బోర్లు వేయిస్తోందని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో శీలం భారతి అనే మహిళా రైతుకు మంజూరైన జలకళ బోరును శనివారం వేయించారు. ఈ సందర్భంగా బోరు వేసేందుకు భూమి చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. రైతులకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం జలకళ పథకం ద్వారా అర్హులైన వారికి ఉచితంగా బోర్లు వేయిస్తుందన్నారు. ఒక్కో రైతులకు రూ.1.40 లక్షలతో 554 అడుగుల మేర బోరు వేసి నీటిని బయటికి తీస్తారన్నారు. అనంతరం విద్యుత్ శాఖా ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరా చేయిస్తారన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా బోర్లు వేయించుకోవచ్చన్నారు. అర్హత కలిగిన రైతుల ఉచిత జలకళ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ.. మైదుకూరు నియోజకవర్గంలో 2023–24 ఏడాది 187 మంది రైతులకు జలకళ పథకం కింద బోర్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకూ 30 పూర్తి చేశారన్నారు. చాపాడు మండలంలో 21 మంది రైతులకు బోర్ వెల్ పథకం మంజూరయిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సచివాలయ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, ఉపాధి హమీ పథకం జగదీశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ పీరయ్య, ఎంపీటీసీ సీమోన్ పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి

దువ్వూరు : మండలంలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ రమకుమారి పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం 7 గంటలకు రేషన్ పంపిణీని ప్రారంభించాలని తెలిఆరు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి వద్దకు రేషన్ బండి వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీలకు, ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చే రేషన్‌ను ఆలస్యం చేయకుండా ఇవ్వాలన్నారు. వీఆర్‌ఓలు డీలర్లతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు జాన్సన్, నారాయణ స్వామి, డిప్యూటీ తహసీల్దార్ అలీఖాన్, డీలర్లు పాల్గొన్నారు.

లక్కీ డీప్ విజేతల ఎంపిక



లక్కీ డీప్ విజేతలను ఎంపిక చేస్తున్న అర్బన్ సీఐ

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో బస్సుల్లో ప్రయాణించే వారి కోసం అధికారులు ప్రవేశపెట్టిన లక్కీ డీప్ గిఫ్ట్ స్కీంలో శనివారం విజేతలను ఎంపిక చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సమక్షంలో అతిథులుగా పాల్గొన్న అర్బన్ సీఐ ఏపీ మస్తాన్, ఎస్ఐ ఘన మద్దిలేటి ప్రయాణికుల టికెట్ల నుంచి విజేతలను ఎంపిక చేశారు. నవంబర్ 1 నుంచి 15 వరకు ప్రయాణించిన వారి నుంచి విజేతలను ఎంపిక చేసినట్టు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. కడప–పోరుమామిళ్ల రూట్‌లో ఎం.మేరి, సి.నాగమ్మ, నాని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. మైదుకూరు – గిద్దలూరు రూట్‌లో బి.బాబు, ఎస్.నవీన్, కె.విష్ణు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు.

డిసెంబర్ 10న భగవద్గీత పోటీలు

ప్రొద్దుటూరు : కడప నగరం రాజంపేట రోడ్డు శ్రీవిద్యాధరపురంలోని శ్రీలలితా పంచాయతన దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో డిసెంబర్ 10న భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ పూర్వ ధర్మప్రచార మండలి సభ్యుడు డాక్టర్ మూలే రామమునిరెడ్డి తెలిపారు. భగవద్గీత మూడవ అధ్యాయం కర్మయోగంలోని 30 శ్లోకాలు పోటీలో పాల్గొనేవారు కంఠస్తం చేసి చెప్పాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 6, 7 తరగతుల విద్యార్థులు జూనియర్లు, 8, 9 తరగతుల విద్యార్థులు జూనియర్లు, ఇతరులైతే 18 ఏళ్లలోపు వారు జూనియర్లుగా, 18 ఏళ్ల పైబడిన వారు సీనియర్లుగా పోటీలో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు.

రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట

- రెండు పంటలకు నీరు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరుతా
- రైతుల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో శనివారం ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల రైతులతోపాటు ఇరిగేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్లు సమృద్ధిగా వర్షాలు పడ్డాయని, ఈ ఏడాది మాత్రమే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంటలను సాగు చేసిన రైతులకు వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ సమస్యను గుర్తించి తాను నెల రోజుల క్రితమే కలెక్టర్‌కు చెప్పడం, నీరు విడుదల చేయడం జరిగిందన్నారు. రెండు మండలాల పరిధిలో రెండు పంటలకు నీరు అందించేందుకుగాను వచ్చే ఏడాది ఫిబ్రవరికు నీరు విడుదల చేయాలని కలెక్టర్‌ను కోరుతామన్నారు. సోమవారం రైతు బృందంతో కలసి కడపలో కలెక్టర్‌ను కలుస్తానని పేర్కొన్నారు. రాజోలి ఆనకట్ట ద్వారా చాపాడు, టంగుటూరు ప్రధాన కాలువలకు సాగు నీరు అందించామని, మైలవరం డ్యాం ద్వారా ప్రత్యామ్నాయంగా గోపవరం కాలువ నుంచి నీరు విడుదల చేస్తున్నామన్నారు. గోపవరం కాలువ ద్వారా గతంలో ఏ ప్రభుత్వం నీరు విడుదల చేయలేదన్నారు. 18 ఏళ్లుగా పేరుకుపోయిన పూడికను ఇప్పుడు తొలగించామని, రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఎందుకు ఈ సమస్యను గుర్తించలేదో చెప్పాలన్నారు. కాలువల వెంబడి వాహనాలు వెళ్లేందుకు దారులు ఏర్పాటు చేయాలంటే రూ.7కోట్లు నిధులు అవసరమవుతాయన్నారు. చాపాడు కాలువను పరిరక్షించుకోగలిగితే ప్రతి ఏడాది రైతులకు నీరు అందించే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యలను కలెక్టర్‌కు వివరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెండు మండలాల పరిధిలోని రైతులు స్వచ్ఛందంగా కలెక్టరేట్‌కు తరలి రావాలని కోరారు. సమావేశంలో కేసీ కెనాల్ డీఈ బ్రహ్మరెడ్డి, మైలవరం జలాశయం డీఈ అశ్వర్థ నారాయణ, ఏఈలు లలిత, హనుమారెడ్డి ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, రాజుపాళెం వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, రాజుపాళెం మండల గ్రామ సచివాలయాల ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల జనన నియంత్రణ కేంద్రం ప్రారంభం

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కంపోస్టు యార్డు వద్ద ఏర్పాటు చేసిన కుక్కల జనన నియంత్రణ కేంద్రాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు కుక్కల బెడద ఉందన్నారు. చాలా ప్రాంతాల ప్రజలు నిత్యం ఈ సమస్యతో ఇబ్బందులు పడటం, ప్రతి ఏడాది తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. కుక్కల బెడదను నియంత్రించాలంటే ముందుగా వాటి ప్రత్యుత్పత్తి జరగకుండా చూడాలని తెలిపారు. అందుకోసమే తాను అధికారులపై ఒత్తిడి తెచ్చి కుక్కల జనన నియంత్రణ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయించానన్నారు.

యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

బద్వేలు అర్బన్ : మాదకద్రవ్యాల మత్తులో పడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అర్బన్ సీఐ పి.యుగంధర్ పేర్కొన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలను అరికడదాం–సమాజాన్ని కాపాడుదాం అనే పేరుతో రూపొందించిన గోడపత్రాలను శనివారం అర్బన్‌స్టేషన్ ఆవరణలో సీఐ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలు వాడటం ద్వారా మనిషి మెదడుపై తీవ్ర ప్రభావం చూపి ఆలోచన శక్తి నశించి నేరాల బాట పట్టే అవకాశం ఉందని, ఇందుకోసం మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మత్తుపదార్థాల జోలికి వెళ్ళకుండా యువత అప్రమత్తంగా ఉండటంతో పాటు ఉన్నత చదువులు చదువుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అలాగే యువతలో చైతన్యం తీసుకువచ్చేందుకు డీవైఎఫ్ఐ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో విద్యాప్రమాణాలు పెంచండి

పోరుమామిళ్ల : కళాశాలలో విద్యా ప్రమాణాలు పెంచడం ద్వారా విద్యార్థుల స్థాయి పెరుగుతుందని, కళాశాల అభివృద్ధి బాటలో నడుస్తుందని అకడమిక్ ఆడిట్ అడ్వయిజర్లు డాక్టర్ గురివిరెడ్డి, డాక్టర్ రామచంద్ర తెలిపారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో వారు ఆడిట్ నిర్వహించారు. 2021–22, 2022–23 విద్యాసంవత్సరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాలలో పీహెచ్‌డీలు చేసిన అధ్యాపకులుండటం, పరిశోధన పేపర్లు కలిగి ఉండటం అభినందనీయమన్నారు. సమీపంలోని పరిశ్రమలు, వివిధ రకాల సంస్థలతో ఎంఓయూలు చేసుకుని విద్యాప్రమాణాలు పెంచాలని సూచించారు. కళాశాలలో నేషనల్ సెమినార్స్, వర్క్‌షాప్స్ నిర్వహించాలన్నారు. కళాశాల పురోగతికి తీసుకోవాల్సిన చర్యలు సూచించారు.

మైదుకూరులో క్రికెట్ మ్యాచ్ లైవ్ ప్రదర్శన

మైదుకూరు : ప్రపంచ కప్‌లో భాగంగా ఆదివారం జరగనున్న ఇండియా – ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌ను మైదుకూరులో ఫొటో గ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు లైవ్ టెలికాస్ట్ చేయనున్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి ఈ మ్యాచ్‌ను ప్రేక్షకులు తిలకించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభిస్తారని ఫొటో గ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

క్రీడాభిమానులకు కనువిందు

బద్వేలు అర్బన్ : ఫైనల్ మ్యాచ్‌ను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మ, వైఎస్సార్‌సీపీ గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య తెలిపారు.